వైభవంగా విజయదశమి


వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జమ్మిపూజ నిర్వహించిన ఆలయ కమిటీ నేతలు


రావణ దహనంలో పాల్గొన్న ఈజీ లావణ్య

ఎల్‌బీనగర్‌, మలక్‌పేట జోన్లలో దసరా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జమ్మిచెట్టుకు ప్రత్యేక పూలు నిర్వహించి ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నాగోలు పోలీస్‌ స్టేషన్‌లో సీఐ మక్బూల్‌జానీ సిబ్బందితో కలిసి ఆయుధ పూజ చేశారు. సాయంత్రం రావణ దహనం నిర్వహించారు.
– ఎల్‌బీనగర్‌, మలక్‌పేట జోన్లబృందం


జమ్మిపూజలో పాల్గొన్న భక్తులు


మహంకాళి దేవాలయంలో పూజలు నిర్వహించిన ఎంపీ ఈటల


ఆలయంలో జమ్మివృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు


కర్మన్‌ఘాట్‌ రాంలీలా మైదానంలో రావణదహనం


నాగోలు డివిజన్‌ రాక్‌టౌన్‌కాలనీ సంక్షేమ సంఘం ఆవరణలో రావణ దహనం


స్నేహపురికాలనీలో జమ్మి చెట్టు పూజలో పాల్గొన్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అనంతుల సురేందర్‌రెడ్డి



దసరా మహోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌


ఎన్టీఆర్‌నగర్‌లో దసరా వేడుకల్లో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి


ఆటోనగర్‌లోని వనదుర్గామాత అసోసియేషన్‌ అమ్మవారి పూజలో మాలాధారులు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.19, వంకాయ రూ.28, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.48, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.18, క్యారెట్‌ రూ.35, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.45, మునగ రూ.95, కందగడ్డ రూ.50, బీట్‌రూట్‌ రూ.28, కీర రూ.23, బీన్స్‌ రూ.55, క్యాప్సికమ్‌ రూ.50. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

శుభాకాంక్షలు



ఎల్‌బీనగర్‌: ఇటీవల డీజీపీగా బాధ్యతలు చేపట్టిన శివధర్‌రెడ్డిని గురువారం గ్రేటర్‌ హైదరాబాద్‌ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు సంరెడ్డి భుజంగరెడ్డి ఆధ్వర్యంలో పలువురు కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

హ్యాండీక్రాఫ్ట్‌ మేళాకు స్పందన


మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హెచ్‌ఎండీఏ ఓపెన్‌ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్‌ ఇండియా హ్యాండ్లూమ్‌, హ్యాండీక్రాఫ్ట్‌ మేళాకు స్పందన వస్తోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్‌, డిజైనర్‌, కాంతావర్క్‌, హ్యాండ్‌ బ్లాక్‌, ప్రింటెడ్‌, లినెన్‌, కళంకారీ, బెంగాల్‌ కాటన్‌, లక్నోచికాన్‌, బనారస్‌ చీరలు, లేడీస్‌ ఫ్యాన్సీ టాప్స్‌, డిజైనర్‌ బ్లౌజెస్‌, ఖాదీ మెటీరియల్‌, వన్‌గ్రామ్‌ గోల్డ్‌ జ్యూవెలరీ, జైపూర్‌ బెడ్‌ షీట్స్‌, కొండపల్లి బొమ్మలు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్‌అలీ తెలిపారు.

ల్యాప్‌టాప్‌ అందజేత


ల్యాప్‌టాప్‌ అందజేస్తున్న కృష్ణయాదవ్‌

చైతన్యపురి: దసరా పండుగ సందర్భంగా గడ్డి అన్నారం మాజీ కౌన్సిలర్‌ గండి కృష్ణయాదవ్‌ విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ అందజేశారు. మధురాపురి కాలనీకి చెందిన విద్యార్థిని సత్యప్రియ ఉన్నత చదువులకు తోడ్పాటుగా ల్యాప్‌ టాప్‌ అందించినట్లు కృష్ణయాదవ్‌ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేట ప్రాంతానికి చెందిన నాగ నారాయణమూర్తి కుమారుడు కె.సురేష్‌ కార్తీక్‌ (43) సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి. కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వివిధ ఆసుపత్రుల చుట్టూ తిరిగినా వ్యాధి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మలక్‌పేట– డబీర్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాల్‌ బహదూర్‌ శాస్త్రి విగ్రహానికి నివాళి

హుడాకాంప్లెక్స్‌: లాల్‌ బహదూర్‌ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని గురువారం సరూర్‌నగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ఆకుల శ్రీవాణి, తదితరులు మాట్లాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని వారు సూచించారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



హస్తినాపురం: తప్పిపోయిన ఓ బాలుడుని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ తోట మహేశ్‌ వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం వనస్థలిపురం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని రైతుబజార్‌ దగ్గరకు పనిమీద వచ్చిన మహిళ ఏడేళ్ల కుమారుడు కనిపించకుండా పోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ పుటేజీల ద్వారా బాలుడిని గుర్తించి తల్లికి అప్పగించినట్లు సీఐ మహేశ్‌ తెలిపారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు


అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


జనప్రియహోమ్స్‌లోని స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న భక్తులు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా యాగశాలలో మహా పూర్ణాహుతి, తిలకధారణ, చక్రస్నానం, కుంభ సంప్రోక్షణ, అన్నప్రసాద వితరణ, ద్వాదశారాధన, శ్రీపుష్ప యాగం, ద్వాదశ ప్రదక్షిణములు, మహాదాశీర్వచనం, పండిత సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ కే.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి శ్రీధర్‌, సంయుక్త కోశాధికారి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

◆ వనస్థలిపురం చింతలకుంట జనప్రియహోమ్స్‌ కాలనీలోని శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా మహా పూర్ణాహుతి, చక్రస్నానం, సప్తావర్ణములు, ద్వాదశారాధన, మహాదాశీర్వచనం, రుత్విక్‌ సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్‌, చైర్మన్‌ పీ.వీ.నర్సింహారావు, పవన్‌, సుదేంద్రకులకర్ణి, సాంబశివరావు, శాంతశ్రీ, విజయలక్ష్మి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

'బాకీకార్డు' ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం


ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో బీఆర్‌ఎస్‌ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్‌: అసెంబ్లీ ఎన్నికల సమయంలో అమలుకు నోచుకోని హామీలను గుప్పించిన కాంగ్రెస్‌, అధికారంలోకి రాగానే వాటిని విస్మరించిందని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌ శర్మ అన్నారు. దసరా పండగని పురస్కరించుకొని శుక్రవారం మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డిని మీర్‌పేట్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా అరవింద్‌ శర్మ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్‌ పార్టీ కాంగ్రెస్‌ బాకీకార్డు ఉద్యమాన్ని తీసుకువచ్చిందని, ప్రజల్లోకి ఆ ఉద్యమాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని సబితా ఇంద్రారెడ్డి సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శేఖర్‌, శ్యామ్‌గుప్తా, జగన్మోహన్‌ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్‌, భూపాలరెడ్డి, రమేష్‌ కురుమ, కపిల్‌ పాల్గొన్నారు.

ముగిసిన పూర్ణాహుతి


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రామచంద్రరావు

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురంలోని కుర్తాల పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవి దేవాలయంలో నిర్వహించిన మహాపూర్ణాహుతి ముగిసింది. ముగింపు సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌. రామచంద్రరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు నిర్వహించిన కుంకుమార్చన, మహా నక్షత్ర హారతులు ఆకట్టుకున్నాయి.ఈ పూజ కార్యక్రమంలో కొత్తపేట కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌, నాయకులు ధీరజ్‌ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్‌ సువర్ణలత దంపతులు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో విట్టల శర్మ, నిఖిల్‌ శర్మ, అరుణ, కృష్ణ, హేమ, కాలనీ ప్రతినిధులు రామారావు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి కార్పొరేటర్ల సన్మానం



మలక్‌పేట/నాగోలు/మన్సూరాబాద్‌: నగరానికి విచ్చేసిన కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ను బీజేపీ కార్పొరేటర్లు బేగంపేట విమానాశ్రయంలో కలిసి స్వాగతం పలికారు. మూసారంబాగ్‌ కార్పొరేటర్‌ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌, మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి రాజ్‌నాథ్‌ సింగ్‌ను కలిసి సన్మానించారు.





వరల్డ్‌ వైల్డ్‌ లైఫ్‌ వారోత్సవాలు షురూ

బహదూర్‌ పురా: నెహ్రూ జూలాజికల్‌ పార్క్‌ లో 71 వరల్డ్‌ వైల్డ్‌ లైఫ్‌ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల రెండు నుంచి ప్రారంభమైన ఈ వేడుకలలో మొదటి రోజు సందర్శనకు వచ్చిన చిన్నారులతో డ్రాయింగ్‌ పోటీలను నిర్వహించారు. ఐదు వందల మంది చిన్నారులకు జంతువులు వాటి సహజ సిద్ధమైన నివాసాలపై డ్రాయింగ్‌ పోటీలు నిర్వహించారు. రెండవ రోజు 3000 మంది సందర్శకులకు సరిసృపాల హౌస్‌, యంపీ థియేటర్లలో పాములపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు.ఈ నెల 4వ తేదీ ప్లాంటేషన్‌ డ్రైవ్‌, యానిమల్‌ కీపర్స్‌ టాక్‌ షో, 5వ తేదీ ఏనుగుల ఆహారం నిపుణులతో ప్రత్యేక చర్చ నిర్వహించబడుతుంది. 6న జూ డే వేడుకలు. 7న వైల్డ్‌ లైఫ్‌ యోగా సెషన్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, 8న జూ వైల్డ్‌ లైఫ్‌, ఉద్యోగులు, సందర్శకులతో జూ లో వన్య ప్రాణి పరేడ్‌ కార్యక్రమాలు ఉంటాయి. నెహ్రూ జూలాజికల్‌ పార్క్‌ ఉద్యోగుల కోసం క్రికెట్‌, బాడ్మింటన్‌, తదితర కార్య క్రమాలను నిర్వహించనున్నట్లు డిప్యూటీ క్యూరేటర్‌ తెలిపారు.

నిరాశ్రయులకు బాసటగా స్వచ్ఛంద సంస్థలు

కాచిగూడ: 'జాయ్‌ ఆఫ్‌ గివింగ్‌'లో భాగంగా కాచిగూడ రైల్వేస్టేషన్‌ వద్ద పీపుల్స్‌ కలెక్టివ్‌ ఫర్‌ ప్రొటెక్షన్‌ ఆఫ్‌ చిల్డ్రన్‌, జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో 'అండర్‌ ది స్టార్స్‌'కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ప్రతీ లక్ష మంది జనాభాకు ఒక నిరాశ్రయ షెల్టర్‌ ఉండాలని కానీ కోటిన్నర జనాభా కలిగిన నగరంలో కేవలం 13 మాత్రమే ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిరాశ్రయ షెల్టర్ల సంఖ్య పెంచి ప్రస్తుతం నడుస్తున్న సెల్టర్‌ నిర్వహణ వ్యయం పెంచాలని కోరారు. రోడ్లపై నిరాశ్రయులు లేకుండా స్వచ్ఛంద సంస్థల సహకారంతో తగిన చర్యలు ప్రభుత్వం వెంటనే తీసుకోవాలని వారు డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు, ఇందిరా, జయశ్రీ, అంబికా, అనురాధ, వెంకట్‌రెడ్డి, అరుణ, రాంజీ, రేణుక, రాము, ఫిరోజ్‌, సాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి


నాగోలు చౌరస్తాలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా


ఎల్‌బీనగర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన సీఐ వినోద్‌కుమార్‌

నాగోలు: సత్యం, అహింస మార్గంలో నడిపించిన మహాత్ముడు గాంధీ అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్‌ జాతీయ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా అన్నారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా నాగోలు చౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కుల సాధనకై శాంతియుత పోరాటాన్ని బోధించి, ఆచరణలో చూపారన్నారు. ప్రపంచానికి అహింసా, సత్యాగ్రహ సిద్ధాంతాలను అందించిన గాంధీ మార్గం ఎప్పటికీ అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జగిని అశోక్‌, అనిల్‌, సాయి రమేష్‌, జూపల్లి శ్రీనివాస్‌, ప్రకాశ్‌ కుమార్‌, రాంనర్సింహరావు, మల్లికార్జున్‌, మంచాల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో..

మన్సూరాబాద్‌: మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఎల్‌బీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్‌ సహారాస్టేట్స్‌ ప్రధాన ద్వారం వద్ద గాంధీ విగ్రహానికి పలువురు నేతలు, కాలనీ సంక్షేమ సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎల్‌బీనగర్‌ పోలీస్‌స్టేషన్‌ సమీపంలోని గాంధీ విగ్రహానికి పోలీస్‌ ఇన్‌స్పెక్టర్‌ వినోద్‌కుమార్‌, బీఆర్‌ఎస్‌ నేత మామిడి రాంచందర్‌ నివాళి అర్పించారు.

బెల్ట్‌ షాపుల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు

కన్నెత్తి చూడని ఎక్సైజ్‌ అధికారులు



నాగోలు: గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ఎల్‌బీనగర్‌ ప్రాంతంలోని మద్యం దుకాణాలన్నీ మూసేశారు.ఇదే అదనుగా భావించిన బెల్ట్‌ షాపులు నిర్వాహకులు అధిక ధరలకు మద్యం విక్రయించి సొమ్ము చేసుకున్నారు. వివిధ బస్తీలల్లో బెల్ట్‌ షాపుల ద్వారా పెద్ద ఎత్తున్న మద్యం విక్రయించారు. ఎల్‌బీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మాన్సురాబాద్‌, ఎల్‌బీనగర్‌, ఎన్టీఆర్‌నగర్‌, నాగోలు పరిధిలోని జైపురికాలనీ, డిఎస్‌ఎస్‌నగర్‌, డబుల్‌ బెడ్‌ ఇతర ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి వరకు మద్యం పెద్ద ఎత్తున్న విక్రయించారు. బెల్ట్‌ షాపుల వైపు పోలీసులు, ఎక్సైజ్‌ పోలీసులు గాని కన్నెత్తి చూడకపోవడంతో బెల్ట్‌ షాపు నిర్వాహకులు లక్షల్లో దండుకున్నారు. ఎల్‌బీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఎన్టీఆర్‌నగర్‌ కూరగాయాల మార్కెట్‌ రోడ్డు ఉన్న ఓ బెల్ట్‌ షాప్‌లో గురువారం రాత్రి ఒక్క రోజు రూ. 8 లక్షల వరకు మద్యం విక్రయించినట్లు స్థానికులు పేర్కొన్నారు. బయట తక్కవ ధరకు మద్యం కొనుగోలు చేసిన బెల్ట్‌ షాపులో అధిక ధరకుల మద్యం విక్రయించారు. గాంధీ జయంతి రోజు మద్యం విక్రయించరాదని అధికారులు చెప్పినా బెల్ట్‌షాపు నిర్వాహకులు మాత్రం అవేమి పట్టించుకోకుండా విచ్చలవిడిగా విక్రయాలు కొనసాగించాలని స్థానికులు పేర్కొన్నారు.

పర్యవేక్షణ కరువై.. చెత్తకు నిలయమై..

● పేరుకుపోతున్న వ్యర్థాలు ● పట్టించుకోని అధికారులు


మూసారంబాగ్‌లో ఫుట్‌పాత్‌లపై కొమ్మలు, రోడ్లపై పారుతున్న మురుగు


హయత్‌నగర్‌లోని కల్వర్టు వద్ద పేరుకుపోయిన చెత్త

ఎల్‌బీనగర్‌: ఎల్‌బీనగర్‌ నియోజకవర్గ పరిధిలోని కాలనీలు, ప్రధాన రహదారులలో చెత్త పేరుకపోతున్నా తరలించే నాథులే లేరదని స్థానికులు మండిపడుతున్నారు. గత కొన్ని రోజులుగా చెత్త పేరుకుపోవడంతో అందులో నుంచి దుర్వాసన వచ్చి రోగాల బారిన పడుతున్నామని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేక సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ దుస్థితి నెలకొందని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూసారంబాగ్‌, అక్బర్‌బాగ్‌ ప్రాంతాల్లో..

మలక్‌పేట: మూసారంబాగ్‌, అక్బర్‌బాగ్‌ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై చెట్ల కొమ్మలు పేరుకుపోగా, మరోవైపు రోడ్లపై మురుగు నీరు ఏరులై పారుతోంది. అధికారుల పర్యవేక్షణ లేక సమస్యలు తలెత్తున్నాయి. గణేష్‌ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా జీహెచ్‌ఎంసీ, వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్‌శాఖ తొలగించిన చెట్ల కొమ్మలను తొలగించకపోవడంతో ఆ ప్రాంతాలన్నీ దుర్గంధంగా మారుతున్నాయి. చెత్త కారణంగా దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇరు శాఖల అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తరలించే మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.